# 37. బుడ్డరచనలు – బడారచయితలు

మా ఆలిండియా బుడ్డ రచయితల మహాసభకు మీరు వస్తున్నారు గదా?అని నిలేసి అడిగేరు సదరు సంఘం సెక్రటరీ జనరల్ గారు.

"ఎవరండీ ! ఆ బుడ్డరచయితలు? ఏ లోకం నుండి వస్తు న్నారూ? అని పరామర్శించేను.

భూతద్దాల్లోంచి ఎగాదిగా చూసేరా సెక్రటరీ జనరల్ గారు.

"ఈమధ్య ప్రతికవిగాడూ తనకుతానే మహాకవి అనో, కవిరత్న అనో, కవి వజ్రము, కవి కిర్సనాయిల్, కవి పంచ దార అనో బిరుదులు తగిలించుకుని అచ్చేయించుకుంటు న్నారు గదాండీ! దాంతో మా ఆలిండియా మహాకవుల మహా సభలకు విలువ లేకుండా పోయింది. పైగా వీళ్ళంతా గ్రాంట్లకోసం ఎడ్యుకేషన్ డిపార్టుమెంటుమీద దాడులుమొదలెట్టటంతో గవర్నమెంటు హడలిపోయి "ఇక్కడ మహాకవులకు, వారి మహాసభలకు గ్రాంట్లు ఇవ్వబడవు" అని ఓ బోర్డుకూడా తగిలించేసింది గ్రాంట్లు లేకుంటే మనం మహాసభలు జరపటం, సాహిత్యసేవ చేయటం ఎలా చెప్పండి?

అసలే మాఆవిడ, మా పెద్దమ్మాయి పెళ్ళి అర్జంటుగా చేసేయా లని రోజూ పోరుతూంది కూడానూ. అందుకని ఈ సారి మహాకవుల మహాసభలకు బదులు బుడ్డకవుల మహాసభలేర్పాటు చేస్తున్నాను" అన్నారాయన ఘనకార్యం చేస్తున్న వాడిలా.

"మరి బుడ్డకవులంటే ఎవరండీ?"

"మన్లోమాట! బాలకవులు అంటే 'మొన్ననే గదయ్యా ఆలిండియా బాలల మహాసభలకు గ్రాంట్లిచ్చాం. దానికి చాలా మంది బాల కవులు కూడా వచ్చారు గదా! మళ్లీ ఈ మహా సభ లెందుకూ?' అనగలరు గవర్నమెంటులోని తల నెరిసిన రంధ్రాన్వేషులు. అందుకని గ్రామ్యభాషలో బుడ్డకవుల మహా సభలంటున్నాం. అదీగాక మనం ప్రజలభాషనూ, మాండలి కాల్నీ గౌరవించాలి గదా!" అన్నారాయన.

అని, "చూశారూ! మనందరికీ సరదాగా ఉండటంకోసం ఈసారి మన మహాసభలు కోటప్పకొండ మీద తిరణాల జరిగే మూడ్రోజులూ ఏర్పాటు చేశాం. కొండకు స్పెషల్‌గా రెండు లారీలు కూడ ఏర్పాటు చేశాం. లారీఛార్జి చాలా చవక. కోటప్పకొండ తిరణాల ఇలా చవగ్గా చూసివచ్చే ఛాన్సు మీకు మళ్ళీ దొరకదు కనుక తప్పకుండా రండేం!" అన్నారాయన.

నేను కోటప్పకొండ వెళ్తున్నానని తెలిసి మా ఇంట్లో అంట్లు తోమే లచ్చమ్మా, దాని మొగుడు రిక్షా రంగన్న ఓ

రోజు తెల్లారే నా దగ్గరికి డిప్యుటేషన్ వచ్చేరు. వాళ్ళకు కొండలో ఏదో మొక్కుందట: "బాబ్బాబు మీ బుడ్డకవుల లారీలో మమ్మల్ని కొండకు తీసుకుపోయి పుణ్యం కట్టుకోండి! మా పుణ్యంలో సగం మీకు ఫ్రీగా ఇచ్చేస్తాం. బస్సు ఛార్జీలు మేము పెట్టుకోలేం" అని బ్రతిమాలేరు.

వాళ్ళ పీడ పడలేక సెక్రటరీ జనరల్‌గార్ని సలహా అడిగేను. ఆయన అమాంతము ఎగిరి వాటేసుకున్నారు. "మీరు రావటమే గాక మరో ఇద్దర్ని కూడా తీసుకొస్తున్నారన్నమాట! దాందేముంది, వాళ్ళిద్దర్నీ డెలిగేట్ల జాబితాలో చేర్చేద్దాం. ఫీజు కట్టండి!" అని ఫారాలిచ్చేడు.

ఇచ్చి "మీరు గానీ మరో నలుగుర్ని డెలిగేట్లుగా చేర్పిస్తే మీకు డెలిగేట్ ఫీజులో కన్సెషన్ ఇస్తాం సుమండీ" అని హామీకూడా ఇచ్చేరు.

మొత్తంమీద రెండులారీల నిండా బయల్దేరి కోటప్ప కొండలో దేవస్థానంవారి తాటాకుల ధర్మసత్రంలో మకాం వేసేం.

ఆ మర్నాడు ఓ మాజీమంత్రిగారు మా ఆలిండియా బుడ్డ రచయితల మహాసభలకు ప్రారంభోత్సవం చేసేరు. మరో మాజీ పంచాయతీబోర్డు చైరుమేన్ అధ్యక్షత వహించేరు. ఓ మాజీ మ్యునిసిపల్ కౌన్సిలర్ సందేశాలు చదివేడు. ఓ కిరాణా దుకాణం ఓనరుగారు స్వయంగా సందేశం ఇచ్చారు. ఆఖర్న

ఎడ్యుకేషన్ డిపార్టుమెంటులో గ్రాంట్లఫైళ్ళు చూసే సెకన్ గుమాస్తాగారు "రచయితలు – బుడ్డరచయితలు – తారతమ్య పరిశీలన" అని గంటన్నర సేపు మహోపన్యాసం చేసేరు. మా బుడ్డ రచయితలంతా అరనిమిషానికోసారి కరతాళధ్వనుల్తో ఆయన ఉపన్యాసాన్ని ఆస్వాదించేరు.

ఆ మధ్యాహ్నం కోటప్పకొండ గుడి దగ్గర కొబ్బరి కాయల కంట్రాక్టరుగా మూడు మేడలు కట్టించిన ఓ బుడ్డ సాహిత్యాభిమాని మా గౌరవార్థం విందు చేసేడు. "నేనూ మీలాగ ఒకప్పుడు కథలు గీకినవాణ్ణే. కాని కొబ్బరికాయలు అంతకన్నా రుచికరమైన యాపారం అని తేల్చుకుని ఇక్కడ సెటిలయేను" అని వినమ్రుడై పరిచయం చేసుకున్నాడాయన.

...ఆ తర్వాత పరస్పర పరిచయాలు మొదలయ్యాయి.

"నన్ను పంచరత్నాల కవి అంటారు" అంటూ ఓ శాలువాగారు పరిచయం చేసుకున్నారు "నేను ఇప్పటికి తొంభై య్యార్లుగురి మీద పంచ రత్నాలు రాశాను. వారిలో ఆరుగురు ఇంకా బ్రతికే ఉన్నారు" అన్నారాయన. మా హోస్టుగారు సగౌరవంగా ఆయనకో అరకిలో పంచదార బహూ కరించేరు.

"నన్ను పండగలకవి అంటారు. దీపావళికి, సంక్రాంతికి, పీర్ల పండక్కీ స్పెషల్‌గా కవిత్వం రాసి, స్పెషల్ ఇస్యూల్లో మాత్రమే అచ్చేయిస్తాన్నేను" అని పరిచయం

చేసుకున్నా రింకో కవిగారు. మా హోస్టుగారు సగౌరవంగా ఆయనకో లీటరు కిరసనాయిలు బుడ్డీ సమర్పించుకున్నారు.

"నన్ను పీనుగులకవి అని గిట్టనివాళ్ళు అంటారనుకోండి. నా అసలు పేరు నాకే గుర్తులేదు. నెహ్రూగారు పోయినపుడు, నిజాంనవాబు పోయినపుడూ కూడా అందరికన్నా ముందుగా నేనే శోక గీతాలు రాసేను" అన్నాడింకో పెద్దమనిషి పరిచయం చేసుకుంటూ. మా హోస్టుగారు ఆయనకేం ఇవ్వాలో తెలీక గాబోలు సెక్రటరీ జనరల్ కేసి చూసేరు.

అలా అందరి పరిచయాలూ అయ్యాక మా లచ్చమ్మ రంగన్నల వంతు వచ్చింది

లచ్చమ్మ వణికిపోతూ లేచి "నేనా! న్నేనా...! నేనాండీ! ఆ బాబుగారి ఇంట్లో అంట్లు తోమేదాన్నండీ" అని నసిగింది. హాలంతా చప్పట్లతో దద్దరిల్లి పోతూండగా సదరు టెంకాయల శ్రేష్ఠిగారు లచ్చమ్మకు నాలుగు కిలోల కొబ్బరి పీచు బహుకరించేరు. లచ్చమ్మ చాలా సంతోషించినట్లుంది. "ఆర్నెల్లదాకా అంట్లకాడ కొబ్బరి పీచుకు ఎతుక్కోనవసరం లేదు మామా!" అని రంగన్న కేసి చూస్తూ మురిసిపోయింది.

ఆరాత్రి మా గౌరవార్థం దేవస్థానం వాళ్ళు సంపూర్ణ మహా భాగవతం తోలు బొమ్మలాట ఏర్పాటు చేసేరు.

తర్వాత రోజూ తెల్లారే కాఫీలు త్రాగి ఓ గంటన్నర సాహిత్య చర్చలు జరుపుకుని సరదగా తిరనాళ్ళలో తిరిగేము.

ఆ మూడు రోజులూ. "దీనినే ప్రజలతో కలసిపోయి వారిని అర్థం చేసికొనుట అంటారు" అని వివరించేరు మా సెక్రటరీ జనరల్ గారు.

ఆ విధంగా మేము ప్రజల్నీ వారి తిరణాళ్ళనూ బాగా స్టడీచేసి చైతన్యవంతులమై నాలుగో రోజున ఎవరి గూళ్ళకు వాళ్ళం చేరాం.

నేను ఇంటికి చేరేసరికి మా ఆవిడ దినపత్రిక చేత్తో పుచ్చుకుని నా మీదకు యుద్ధానికి వచ్చింది.

"ఇదేం పనండీ! మీరు ఇన్ని కథలు, కబుర్లూ రాశారు గదా! మరి ఆలిండియా బుడ్డరచయితల మహాసభకు హాజర యిన ప్రముఖుల జాబితాలో మీ పేరు ఎక్కడా లేదేమండీ, పైగా ఈ అన్యాయం ఏమిటో చూడండీ!" అంటూ పత్రిక నా మొహాన్న కొట్టింది. చూద్దును గదా...

"ఈ మహాసభలకు హాజరయినవారిలో ప్రముఖ రచ యిత్రి లచ్చమ్మగారూ, యువకవి రంగన్నగారూ కూడా కలరు" అని ఉందా పత్రికలో.

(డిశంబర్, 1974)